Namasthe Telangana 01-09/11/16.




మీడియాతో మాట్లాడుతున్న మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తదితరులు

# వచ్చే ఉగాదికి మెట్రో!

**హైదరాబాద్ వాసులు ఎంతోకాలంగా వేచి చూస్తున్న శుభ ముహూర్తం ముందుకొచ్చేసింది. వచ్చే ఏడాది ఉగాదినాడు గానీ, 2017 జూన్ రెండో తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన గానీ మెట్రో రైలు సర్వీసులు ప్రారంభం అవుతాయని మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు.**

హైదరాబాద్ సిటీబ్యూరో,
నమస్తే తెలంగాణ:

వచ్చే ఏడాది ఉగాది పర్వదినాన గానీ, జూన్ రెండో తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన గానీ మెట్రో రైళ్ల ప్రారంభానికి రంగం సిద్ధంచేస్తున్నామని హైదరాబాద్ మెట్రో రైల్ (హెచ్ఎంఆర్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. మెట్రో రైలు ప్రాజెక్టు పనులు జరుగడం లేదని, వేగం తగ్గిందన్న ప్రచారాన్ని నమ్మొద్దని మంగళవారం మీడియాతో చెప్పారు. మొదటిదశలో నాగోల్ – బేగంపేట మధ్య మెట్రో రైలు సర్వీసులు ప్రారంభిస్తామన్నారు. చిన్న స్ట్రెచ్‌ల మధ్య నడుపడం వల్ల ప్రాజెక్టు విఫలమయ్యే అవకాశాలు ఉన్నాయని బెంగళూరు, చెన్నై మెట్రో ప్రాజెక్టులు రుజువుచేశాయని తెలిపారు. 72 కిలోమీటర్ల పొడవుతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులో 66 కిలోమీటర్ల వరకు పునాదుల నిర్మాణం పూర్తయిందని, 57 కిలోమీటర్ల మేర పూర్తిస్థాయిలో స్తంభాలు నిర్మించామన్నారు. ఇప్పటివరకు 20 కిలోమీటర్ల వరకు (నాగోల్ – మెట్టుగూడ మధ్య ఎనిమిది కిమీ, మియాపూర్ – ఎస్సార్ నగర్ మధ్య 12 కిమీ) పనులు పూర్తయ్యాయన్నారు. ఇక పాతబస్తీ పరిధిలో కేవలం 6 కిమీ పరిధిలో నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. మరో 200 పునాదులు, 250 స్తంభాల నిర్మాణంతో ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. ప్రాజెక్ట్ కింద ఎనిమిది ఆర్వోబీల్లో ఆరింటితో సమస్యలు నెలకొన్నాయన్నారు. ఆర్వోబీల నిర్మాణానికి రైల్వేశాఖకు పరిహారం చెల్లింపుపై భేదాభిప్రాయాలున్నాయని అన్నారు. దీనిపై రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి కే తారకరామారావు కేంద్ర మంత్రిని కలిసి సమస్య పరిష్కారానికి కృషిచేశారని ఎన్వీఎస్ రెడ్డి వివరించారు. రైల్వేశాఖ అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. ఇప్పటివరకు ఎల్ అండ్ టీ రూ.11,500 కోట్లు, ప్రభుత్వం రూ.200 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. పనులు లేనివారే మెట్రో రైలు ప్రాజెక్టును అడ్డుకొనేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మెట్రో రైలు మార్గంలో చెడిపోయిన రోడ్ల మరమ్మతులకు ఇప్పటికే 20 కోట్లు కేటాయించగా, రూ.15 కోట్లు ఖర్చయ్యాయన్నారు. అవసరాన్ని బట్టి మరో రూ. 5 కోట్లు ఖర్చుచేస్తామన్నారు.